# హిందుత్వ, జాతీయ దురహంకార విద్వేష రాజకీయాల గెలుపే - ఎన్నికల్లో మోడీ విజయం

బూర్జువా నేతల బూటకపు వాగ్దానాల రణగొణధ్వనుల మధ్య 17వ లోక్‌సభకు అట్టహాసంగా సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికల్లో దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలేవి చర్చకు రాలేదు. డబ్బు, మద్యం పారించి కులం, మతాన్ని రెచ్చగొట్టి దేశప్రజలను ఆవేశావేశాల్లోకి నెట్టి ఓట్లు వేయించుకుని ప్రపంచంలో అతి పెద్ద బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ విజయం సాధించిందని చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో బీ.జె.పి మరొక్కసారి సంపూర్ణమెజారిటితో కేంద్రంలో అధికారానికొచ్చింది. ఎన్నికల్లో 542 పార్లమెంటరీ సీట్లలో 303 సాధించి బి.జె.పి సంపూర్ణ మెజారిటి సాధించగా, దాని మిత్రపక్షాలతో కూడుకొని (ఎన్‌డీఏ) 353 సీట్లు సాధించింది. ప్రతిపక్షాలు ఈసారి ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ స్వంతంగా 52 సీట్లకు పరిమితం కాగా, దాని మిత్రపక్షాలతో కూడుకుని యుపిఏ 90 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఉత్తరప్రదేశ్‌లో మహా ఘట్‌బంధన్ 15 స్థానాలు సంపాదించింది. మొత్తం ప్రాంతీయ పార్టీలకు, ఇతరలకు 99 సీట్లు వచ్చాయి. ఇక చెప్పుకోవాలంటే బి.జె.పి తాకిడిని తట్టుకొని ఒడిస్సాలో నవీన్‌పట్నాయక్, తమిళనాడులో డిఎంకే – కాంగ్రెస్ ఘట్‌బంధన్, కేరళలో కాంగ్రెస్, ఏపిలో వైఎస్‌ఆర్‌సిపి, బెంగాల్‌లో మమతబెనర్జీ గట్టిపోటీ ఇచ్చి అత్యధిక సీట్లు సాధించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో బి.జె.పి తన ఖాతా తెరవలేదు. ప్రధానంగా ఉత్తరభారతంలో బి.జె.పి, కాంగ్రెస్ ముఖాముఖి పోటీపడినా 186 స్థానాల్లో బి.జె.పి 174 స్థానాలు గెలవగా కాంగ్రెస్ 15 స్థానాలు మాత్రమే గెలిచింది. దేశంలో 20 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రాతినిధ్యాన్ని కోల్పోయింది. లోక్‌సభకు ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిలో అరుణాచల్‌ప్రదేశ్ బి.జె.పి విజయం సాధించగా, తక్కిన రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీలు విజయం సాధించాయి.

2019లో జరిగిన 17వ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకీ లభించిన ఘనవిజయంకు గల కారణాలను మనం లోతుగా పరిశీలించాలి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ గత ఐదు సంవత్సరాల పరిపాలనలో అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలతో భారతీయ జనతా పార్టీ రాజకీయ ప్రతిష్ఠ క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ ధోరణి 2018 డిసెంబర్ వరకు కొనసాగింది. దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించి అందుకు అన్ని రాజకీయ పార్టీలు సన్నద్ధం కావడం ప్రారంభించిన సమయంలో పుల్వామా ఘటన జరగటం, దానికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం బాలాకోట్ ఎయిర్ స్ట్రయిక్ నిర్వహించటంతో దేశంలో ఒక్కసారిగా బి.జె.పికి అనుకూలమైన రాజకీయ వాతావరణం ఏర్పడింది. దేశం 'మోడి చేతిలో ఉంటేనే దేశానికి రక్షణ' అభిస్తుందని, మోడీ తీసుకున్న సాహసోపేత చర్య వల్లనే పాకిస్తాన్‌ను త్రిప్పికొట్టామని, 'బలమైన కేంద్ర ప్రభుత్వం' కావాలని, "అబ్‌కా భారీ మోడీ సర్కార్" అనే నినాదాలపై భారతీయ జనతా పార్టీ బలమైన ప్రచారాన్ని కొనసాగించింది. పాకిస్తాన్ వ్యతిరేక ప్రచారంతో దేశవ్యాప్తంగా ప్రజలను ప్రదర్శనలకు ఉసిగొల్పింది. దేశంలో చెలరేగిన ఈ జాతీయ దురహంకార దుమారం (జింగోయిజం) వలన ప్రతిపక్షాలు ఒంటరి అయిపోయాయి. అవి చాలావరకు డిఫెన్స్ స్థితిలోకి నెట్టబడ్డాయి. ఈ రాజకీయ మార్పును ఆర్ఎస్ఎస్, భాజపాలు కలిసి తమకు మరింత అనుకూలంగా మార్చుకుంటూ, ఎన్నికల్లో గెలుపుకు సాధనంగా వాడుకోవడానికి హిందుత్వంతో కలిపి దేశరక్షణ సమస్యను ముడిపెట్టి దేశవ్యాప్తంగా గ్రామ గ్రామ ప్రచారాన్ని నిర్వహించాయి. దీని ప్రభావం ఉత్తర, పశ్చిమ, మధ్య భారతంలో (ఒక్క పంజాబు మినహా) చాల లోతుగా ప్రజలపై పడింది. బి.జె.పి నేరుగా కాంగ్రెసుతో ముఖాముఖి పోటీ వున్న ప్రాంతాలు కూడా ఇవే కావడం గమనార్హమైన విషయం. ఈ రకమైన రీతిలో ప్రచారం గావించి తూర్పులో (పశ్చిమబెంగాల్, ఒడిస్సా,) ఈశాన్య భారతంలోకి విస్తరించింది. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెసుకు, ఒడిస్సాలో బిజు జనతాదల్‌కు గట్టి పోటీదారుగా నిలిచింది.

ఎన్నికల ప్రచారంలో మోడీ విడవకుండా బాలకోట్ ఎయిర్ స్ట్రయిక్ ప్రచారాన్ని నిర్వహించడం, బాలకోట్ దాడి నిర్వహించిన వారికే ఓటు వేయాలని చెప్పటం, 'భారతసేన మోడిసేన'ని యోగి చెప్పడంతో భారతీయ జనతా పార్టీ దేశ ప్రజల్లో జాతీయ దురహంకారాన్ని మరింత పెంచి, ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి ప్రయత్నించింది. ప్రతిపక్షాలు లేవనెత్తిన నిరుద్యోగం, నోట్ల రద్దు, జిఎస్టీ, రాఫెల్ జెట్ డీల్, రైతాంగ దుస్థితి గురించి ప్రజలు ప్రాముఖ్యతనివ్వలేదు. అయితే ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై లోతైన అవగాహణ వారికి వున్నప్పటికీ ప్రజలంతా తక్షణం జాతీయ దురహంకారం వైపు కొట్టుకొనిపోయారు.

ఈ ఎన్నికల్లో ఒకవైపు ఎన్డీఏ, మరోవైపు యుపిఏ, ఉత్తరప్రదేశ్‌లో మహ ఘట్‌బంధన్, దేశంలో ఇతర ప్రాంతీయ పార్టీలు పోటీపడ్డాయి. ఎన్నికల ముందు 22 ప్రతిపక్షపార్టీలు కలిసి 'మోడీ హఠావో' అనే నినాదం తీసుకొని కొన్ని సమావేశాలు జరిపినప్పటికీ ఈ పార్టీలు ఒకే వేదిక మీద నుండి ఐక్యంగా బి.జె.పికి వ్యతిరేకంగా పోరాడకపోవడం వలన ఈ పార్టీల ఓట్లు చీలిపోయి బి.జె.పికి లాభం కలిగింది. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ముస్లీంలను ఆకర్షించడంతో అక్కడ సమాజ్‌వాది పార్టీ అభ్యర్థులు చాలామంది ఓటమిపాలైనారు.

నేడు దేశంలో భారతీయ జనతా పార్టీ నాయకుడుగా మోడీకి వున్నటువంటి ప్రతిష్ఠ, ప్రతిపక్షాల్లో ఎవరికి లేకపోవడంతో మోడీ ప్రచారానికి ప్రజలు చాలా ప్రముఖ్యతనిచ్చారు. మోడీ ప్రతి బహిరంగసభలో 'కమలానికి ఓటువేస్తే ఆ ఓటు మోడీకి వెలుతుందని' పదేపదే చేసిన ప్రచారం భారతీయ జనతా పార్టీకి విజయంలో ఒక కారణంగా నిలిచింది. కాంగ్రెసుతో సహ ప్రతిపక్షాలు వాటి నాయకులు ఎవరూ కూడా మోడికీ ప్రత్యామ్నాయంగా దేశ ప్రజల ముందుకు రాలేకపోయారు. ఈ రకంగా మోడీ అనే అంశం కూడా భారతీయ జనతా పార్టీకీ దోహదం

చేసింది. 'ది హిందూ' పత్రికకు సంబంధించిన 'లోక్‌నీతీ' చేసిన టీమ్ సర్వేలో దేశంలో అధ్యక్ష తరహాలో ఎన్నికల ప్రచారంలో వ్యక్తి నాయకత్వం కేంద్రస్థానంలో వుంచబడిందని చెప్పింది. ఉత్తరప్రదేశ్, కర్ణాటక లాంటి రాష్ట్రాల్లో కుల సమీకరణలు, ఓబిసీ, బహుజన సమీకరణలు ఎన్నికల్లో ఓట్లు సంపాదించలేకపోగా, మోడీ నాయత్వంలో భాజపా సంఘటితీకరణ ఆ పార్టీ గెలుపుకు ప్రాతిపదికనేర్పర్చింది.

ఈ మొత్తం ఎన్నిక సరళిలో ఎలక్షన్ కమీషన్ నిర్వహించిన పాత్ర పూర్తిగా పాక్షికతతో కూడుకొని బి.జె.పి గెలుపుకు దోహదం చేసింది. ఎలక్షన్ షెడ్యూల్‌ను మోడీ, షాలు కొన్ని రాష్ట్రాల్లో కేంద్రీకరించి ప్రచారం చేయడానికి వీలుగా రూపొందించింది. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌ల్లో 7 దఫాలుగా ఎన్నిక షెడ్యూలు రూపొందించడంతో మోడీ, షాలు ఈ రాష్ట్రాల్లో కేంద్రీకరించి ప్రచారం చేసి ఫలితాలు సాధించారు. బెంగాల్ చివరిదశ పోలింగ్‌లో షా నిర్వహించిన రోడ్ షోపై టిఎంసి కార్యకర్తలు దాడి చేశారని ఆయన ఫిర్యాదు చేయటంతో ఒక్క రోజు ముందే అక్కడ ప్రచారాన్ని నిలిపివేయడం, మోడీ నిరంతరం ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తూ బాలకోట్ దాడిని తన ఎన్నికల ఉపన్యాసాల్లో పదేపదే పేర్కొనడం లాంటి విషయాలపై ఎన్నికల కమీషన్ ఎలాంటి చర్యతీసుకోకపోగా, ప్రతిపక్షాలు చేసిన ప్రసంగాల్లో వారిపై కొన్ని చర్యలు తీసుకోవడంతో ఎన్నికల కమీషన్ నిష్పక్షపాత వైఖరిపై ప్రజల్లో చాలా సందేహాలు వచ్చాయి.

పై కారణాలతోపాటు ముఖ్యమైన విషయం దేశ ప్రజలు రెండవసారి మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీకీ అధికారాన్ని ఇవ్వాలని స్పష్టంగా కోరుకున్నారు.

మోడీ ఎన్నికల విజయంలో మూడు రకాల శక్తుల ప్రాబల్యాన్ని మనం గుర్తించవచ్చు. మొదటగా దేశాన్ని మెజారిటీకీ సంబంధించిన సమాజంగా రూపొందించడం; రెండవది– సమాజాన్ని హైందవీకరించడం; మూడవది– మెజారిటి ప్రజలు మధ్యతరగతి ప్రజల ఆకాంక్షల్లో కొట్టుమిట్టాడడం. సమాజంకు సంబంధించిన ఈ సమీకరణల సరళీ ముఖ్యంగా 2014 ఎన్నికల నుండి ముందుకురాగా, 2019 ఎన్నికల్లో మరింత బలోపేతం అయింది.

ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి, బిఎస్పీ, ఆర్ఎల్‌డి కలిసి ఏర్పాటు చేసిన మహా ఘట్‌బంధన్‌తో బి.జె.పి ఆ రాష్ట్రంలో సగానికి సగం సీట్లు కోల్పోతుందని అందరూ నమ్మారు. సార్వత్రిక ఎన్నికల ముందు గోరఖ్‌పూర్, పూల్‌పురిలో జరిగిన ఉపఎన్నికల్లో మహా ఘట్‌బంధన్ ప్రయోగం సత్ఫలితాలు ఇవ్వడంతో కూడ ఘట్‌బంధన్ గెలుస్తుందని అందరూ చెప్పుకున్నారు. అలాగే బి.జె.పి కూడ ఉత్తరప్రదేశ్‌లో కోల్పోయే సీట్లను పశ్చిమ బెంగాల్, ఒడిస్సాలో సాధించాలనే పథకం వేసుకుని ప్రయత్నాలు చేస్తోందని కూడా అన్ని పత్రికలు రాసాయి. కాని ఇందుకు విరుద్ధంగా ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆ రాష్ట్రంలో బి.జె.పి కోల్పోయిన స్థానాలు చాల తక్కువే అనే విషయం ఎన్నికల ఫలితాలు సూచించాయి.

పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో ప్రధానంగా జాట్స్‌ల ఓట్లపై ఆధారపడిన ఆర్ఎల్‌డి నుండి 91% జాట్స్ ఈసారి బి.జె.పికి ఓట్లు వేశారు. సమాజవాది పార్టీకీ బలమైన కులంగా నిలిచే యాదవుల నుండి మూడింటిలో ఐదవవంతు మద్దతు మాత్రమే దొరికింది. అయితే బిఎస్పీ కి బలమైన మద్దతు కల్గిన జాటవ్ దళిత సెక్షన్ నుండి నాలుగింట మూడువంతుల ఓట్లు దొరికి కాస్తా ఫర్వాలేదని అనిపించుకొన్నప్పటికీ జాటవేతర దళిత ఓట్లు 50% భాజాపాకు వెళ్ళాయి.

పై తరగతి కులాలు, కూర్మీలు, కొయిరీలు మరియు కింది తరగతికి చెందిన ఓబిసి ఓట్ల సంఘటితీకరణ బి.జె.పి వైపు జరిగినట్లుగా; జాటవ, ముస్లీం, యాదవుల ఓట్లు మహాఘట్‌బంధన్ వైపు జరగలేదు. మొత్తం యుపిలో పై కులాలు, ఓబిసీలు 50% కాగా, దళితులు, ముస్లీంలు, యాదవులు 40% మాత్రమే వున్నారు. మొత్తంగా చూస్తే కులాల సమీకరణలో కూడ బి.జె.పినే ముందుంది. అయితే ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో వున్న యోగి ప్రభుత్వంపై ప్రజల్లో ఒకమేరకు అసంతృప్తి వుంది. ముఖ్యంగా 'గో రక్షక' విధానంతో లావరిస్‌గా తిరిగే పశువులతో చాలా ఇబ్బందులున్నాయని 83% ప్రజలు అసంతృప్తితో వున్నారు. అయినప్పటికీ స్థానిక సమస్యలను అధిగమించి కేంద్ర ఎన్నికల్లో బి.జె.పి విజయం సాధించింది. మొత్తంగా చూస్తే మహాఘట్‌బంధన్ కుల సమీకరణలపైన ఆధారపడగా, బి.జె.పి సమాజాన్ని విభజించి బహుళ ప్రజల హిందూ ఓటుబ్యాంకు సంఘటితీకరణపై ఆధారపడి ఉత్తరప్రదేశ్‌లో విజయం సాధించింది. బీహార్‌లో కూడా ఇదే ప్రయోగంతో బి.జె.పి ఘట్‌బంధన్ విజయం సాధించగా, ఆర్జేడీ నాయకత్వంలో ఘట్‌బంధన్ ఘోరంగా విఫలం అయింది. బిహార్‌లో యాదవుల, ముస్లీం ఓటుబ్యాంకు కలిగిన ఆర్జేడీ ఈసారి ఒక్క సీటు కూడా సాధించలేదు.

పశ్చిమ బెంగాల్‌లో బలమైన టిఎంసితో పోటీపడి బి.జె.పి 40సీట్లలో 18సీట్లు సాధించింది. ఈ రాష్ట్రంలో దశబ్దాలుగా పథకం ప్రకారం ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నది. ఇక్కడ కూడ మెజారిటికి చెందిన హిందువులను సంఘటితీకరణం చేయడంపై బి.జె.పి, ఆర్ఎస్ఎస్‌లు పని చేశాయి. టిఎంసి ప్రభుత్వం ముస్లీంలకు ఇస్తున్న రాయితీలపై హిందువులను రెచ్చగొట్టె పని చేస్తూ వచ్చింది. దుర్గాపూజ పేరిట బి.జె.పి చేస్తున్న పెద్దపెద్ద జన సమీకరణలను మమతా బెనర్జీ అడ్డుకోవడాన్ని హిందువుల్లో ప్రచారం చేసింది. ఈ రకంగా హందువులను సంఘటితం చేస్తూనే, టిఎంసి పార్టీలో చీలికలు ప్రోత్సాహించడం ఆ పార్టీ ఎక్కడ బలహీనంగా వుందో అక్కడ కేంద్రీకరించి స్థానిక టిఎంసి కార్యకర్తలను ఆకర్షించింది. దీనికితోడు టిఎంసి పార్టీ బాధితులైన సిపిఎం కార్యకర్తలు పెద్దసంఖ్యలో బి.జె.పికీ మద్దతునిచ్చారు. ప్రధానమంత్రి మోడీ, బి.జె.పి అధ్యక్షుడు షా ఈ రాష్ట్రంలో చాలా సభలు నిర్వహించి బి.జె.పి కార్యకర్తలు రెచ్చిపోయేలా ప్రసంగాలు చేశారు. దీని వలన పశ్చిమ బెంగాల్‌లో గణనీయమైన స్థానాల్లో బి.జె.పి విజయం సాధించింది.

కర్ణాటకలో ప్రధానంగా బి.జె.పి పశ్చిమ, ఉత్తర కర్ణాటకలోనే బలంగా వుండేది. అయితే ఈసారి అది జెడి(ఎస్)కు బలమైన ప్రాంతాలైన పాత మైసూర్ రీజియన్‌లోకి ప్రవేశించింది. అలాగే హైదరాబాద్ కర్ణాటకలోకి కూడ విస్తరించింది. దీనితో పాటు జె.డి(ఎస్), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వంలో గల లొసుగులను, వారి మధ్య తరుచుగా తలెత్తుతున్న గొడవలతో ప్రజల్లో వారు కోల్పోతున్న ప్రతిష్టను ఉపయోగించుకొని ఈసారి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో విజయాలు సాధించింది. ఈ రాష్ట్రంలో హిందూత్వ పునాదిపై బి.జె.పి బలమైన పార్టీగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ గెలిచిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఈ పార్లమెంటరీ ఎన్నికల్లో ఆ పార్టీకి భారీ పరాజయం సంభవించింది. కాంగ్రెసు పార్టీ ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన వెంటనే 2 లక్షల రూపాయల వరకు రైతు ఋణాలు రద్దుచేయడం, వ్యవసాయానికి విద్యుత్ అందించడంలో కొత్త విధానాలు, చిన్న, మధ్య తరగతి రైతులకు పెన్షన్‌లు ఇవ్వడం లాంటి సంస్కరణలు అమలు చేస్తున్నది. ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత లేనప్పటికీ ప్రజలు భారీగా ఈ ఎన్నికల్లో బి.జె.పి వైపు మొగ్గారు. భారతదేశపు న్యూక్లియర్ పవర్, జాతీయ భద్రత, టెర్రరిజంపై యుద్ధం, బాలకోట్ సర్జికల్ స్ట్రయిక్, బలమైన ప్రభుత్వం అవసరమని మోడీ చేసిన ప్రచారం ప్రజలనాకర్షించింది. దీనితో ప్రజలు బి.జె.పికి భారీగా ఓట్లు వేశారు. ఈ రాష్ట్రాల్లో మొత్తం 65 సీట్లలో బి.జె.పి 62 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెసుకు 3 సీట్లు మాత్రమే వచ్చాయి. ప్రజలు రాష్ట్ర, కేంద్ర ఎన్నికల మధ్య బేదాన్ని చూపెట్టారు.

దక్షిణాదిలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో బి.జె.పికి ఒక్క సీటుకూడా దక్కలేదు. తెలంగాణాలో మాత్రం ఈసారి 4 సీట్లు వచ్చాయి. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ఫలితాల్లో బి.జె.పి పట్ల దక్షిణాది ప్రజల్లో ఏ స్థాయిలో వ్యతిరేకత వుందో అర్థం చేసుకోవచ్చు. తమిళనాడులో జెల్లికట్టు ఉద్యమం నుండి బి.జె.పి తమిళనాడు రాజకీయాల్లో తలదూర్చడం, ఏఐడీఎంకే కేంద్రానికి తొత్తుగా వ్యవహరించడం మొదలు ప్రజల్లో బి.జె.పి వ్యతిరేకత పెరుగుతూ వచ్చింది. 'ఆక్యుపై మెరినా బీచ్' ఉద్యమం మొదలు తమిళనాడులో బి.జె.పికి, కేంద్రంకు వ్యతిరేకంగా ప్రజలు ముఖ్యంగా యువకులు, విద్యార్థులు అనేక పోరాటాలు నిర్వహించారు. ఈ ఉద్యమాలను డిఎంకే సమర్థిస్తూ రావడంతో ప్రజలు డిఎంకేను భారీ మెజారిటితో గెలిపించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన స్పెషల్ కేటగిరి ఇవ్వకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి ఏర్పడింది. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీ నాయకుడైన జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో బలమైన ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందుకు రావటం వలన అధికారంలో వున్న టి.డి.పి ఘోరమైన ఓటమికి గురికావటంతో పాటు బి.జె.పి గతంలో గెలిచిన సీట్లను కూడా కోల్పోయింది.

కేరళలో హిందూత్వ హత్య రాజకీయాలతో పాటు శబరిమలలో ఆందోళనలు నిర్వహించినప్పటికీ బి.జె.పి వైపు ప్రజలు మొగ్గలేదు. ఈ మూడు రాష్ట్రాల్లో ప్రజల ప్రాంతీయ ఆకాంక్షలు, జాతి, భాషా ప్రత్యేకతలు, బలమైన ప్రాంతీయ నాయకత్వ అంశాలు బలంగా పనిచేశాయి. వీటిని ఎదుర్కొని బి.జె.పి నిలబడలేకపోయింది. ప్రత్యేకంగా తమిళనాడులో హిందూత్వ, ఉత్తర భారతదేశ, హిందీ భాషా వ్యతిరేక భావనలు బలమైన మోతాదులో వున్నాయి.

తెలంగాణాలో బి.జె.పి సికింద్రాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణకు చెందిన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల్లో గెలిచింది. ఉత్తర తెలంగాణ నియోజక వర్గాలు టి.ఆర్.ఎస్‌కు బలమైన జిల్లాలు. ఈ నియోజక వర్గాలల్లో బి.జె.పి గెలుపుకు హిందూత్వ రాజకీయ ప్రాతిపదిక కాకుండా స్థానిక రాజకీయ పరిస్థితులు దోహదం చేశాయి. కాంగ్రెసు పార్టీ దక్షిణ తెలంగాణాలో కేంద్రీకరించి 3 సీట్లలో విజయం సాధించింది. ఈ ఫలితాతో టి.ఆర్.ఎస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని అంచనా కట్టవచ్చు. స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్ స్థానంలో ఓటమికి గురైంది. అయితే కేసీఆర్ పట్ల పెరుగుతున్న అసంతృప్తిని వుపయోగించుకోవడానికి ఉత్తర తెలంగాణాలో కేంద్రీకరించినట్లైతే కాంగ్రెసుకు కూడా అవకాశాలు మెరుగయ్యేవి. ఆ మేరకు బి.జె.పికి నష్టం కలిగేది.

ప్రతిపక్షాలు ప్రజల సామూహిక, ఆర్థిక సమస్యలతో పాటు బి.జె.పి వైఫల్యాలను బలంగా బహిర్గతపరచకుండా కుల, సాఫ్ట్ హిందూత్వ రాజకీయాలతో బి.జె.పిని ఎదుర్కోలేక చతికిలబడినాయి. ఈ పార్టీలు పోరాటాలు చేస్తూ, బి.జె.పికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడినా చరిత్ర లేదు. దానికితోడు ఈ పార్టీలు అధికారంలో వున్నకాలంలో ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతూనే వున్నాయి. బూటకపు వాగ్దానాలు కుమ్మరించి అవి అమలు చేయకుండా పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తూనే వున్నాయి. దానితో దినదినం బి.జె.పి తన శక్తిని పెంచుకుంటూ బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజాన్ని దేశ ప్రజలపై రుద్దుతున్నది.

నరేంద్రమోడీ పరిపాలనలో దేశ ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నం అయింది. జిడిపి రేటు 6% కిందికి పడిపోయింది. నిరుద్యోగం 6.5%పెరిగింది. నోట్ల రద్దు, జిఎస్టీతో ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడింది. రైతాంగం నిస్సహాయ స్థితిలోకి నెట్టబడి వేలాదిమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కార్మికుల హక్కులు హరించివేయబడుతున్నాయి. చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు దెబ్బతిన్నాయి. సామ్రాజ్యవాదులకు దేశాన్ని బార్లతెరిచి ఎఫ్‌డీఐని వందశాతం ప్రభుత్వరంగ పరిశ్రమల్లోకి ఆహ్వానించారు. ఎగుమతులు దెబ్బతిన్నాయి. రూపాయి, డాలరు మారకంతో 76 రూపాయలకు పడిపోయింది. బి.జె.పి ప్రభుత్వం దళారీ నిరంకుశ పెట్టుబడిదారులలో మూడున్నర లక్షలు బ్యాంకు ఋణమాఫీ చేసి, ఆ భారాన్ని అంతా పేదప్రజలపై మోపుతున్నది. బి.జె.పి అనుసరిస్తున్న బ్రాహ్మణీయ హిందూత్వ రాజకీయాలతో మైనారిటీలు, దళితులు, ఆదివాసులు, జాతులపై ఘోరమైన హింసాకాండ కొనసాగిస్తున్నది. సెక్యులర్, ప్రజాస్వామిక, దేశభక్తియుత శక్తులపై దాడులు కొనసాగిస్తున్నది.

'అర్బన్ నక్సల్స్' పేరిట పదుల సంఖ్యలో మేధావులను, ప్రజాస్వామిక శక్తులను జైళ్లల్లో నిర్బంధిస్తున్నది. దేశంలో పాకిస్తాన్ వ్యతిరేకతను రెచ్చగొడుతూ తన రాజకీయ పబ్బం గడుపుకుంటున్నది. రాఫెల్ కుంభకోణంలో బి.జె.పి స్వయంగా మోడీ అడ్డంగా దొరికిపోయాడు.

ఇప్పటికీ దేశం ఈ సమస్యలతో సతమతమవుతుండగా, మోడీ రాబోయే పాలనలో సామ్రాజ్యవాదుల దోపిడీకి దేశాన్ని మరింత బార్లా తెరుస్తాడు. దేశ సహజవనరులు అన్నింటినీ సామ్రాజ్యవాదులు తన్నుకపోతారు. అందుకు దేశంలో ఫాసిస్టు పాలనతో ప్రజలపై తీవ్రమైన దమనకాండ కొనసాగిస్తారు. 'సమాధాన్' పథకాన్ని మరింత దూకుడుగా అమలు చేస్తూ ప్రజలపై ముఖ్యంగా ఆదివాసులపై, పేద ప్రజలపై అణచివేత పెంచుతారు. 'నూతన భారతం' పేరిట రాజ్యాంగాన్ని సవరించి హిందూ రాష్ట్ర రాజ్యస్థాపనకు ప్రయత్నాలు తీవ్రతరం అవుతాయి. 'గో రక్షణ' పేరిట మూకదాడులు పెరుగుతాయి. 2019 తర్వాత అసలు ఎన్నికలు అనేవి ఉండవని అంటూ బి.జె.పి నాయకులు ఇప్పటి నుండే ప్రచారాన్ని అందుకున్నారు. ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక హక్కులపై తీవ్రమైన దాడి మరింతగా పెరుగుతుంది. మోడీ 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ – సబ్‌కా విశ్వాస్' అనే నినాదం కేవలం సామ్రాజ్యవాదుల మరింత విశ్వాస్ పొందడం కోసమే గానీ ప్రజల విశ్వాసం కాదని తేలికగానే అర్థమవుతుంది.

దేశంలో హిందూత్వ రాజకీయాలు బలం పుంజుకుంటున్నాయి. బి.జె.పి, ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ శాఖలు దేశవ్యాప్తంగా విస్తరించి, హిందూత్వ ప్రచారంతో హిందువుల్లో సంఘటితీకరణ జరిపి ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో అభివృద్ధి అనే అంశాన్ని పక్కన పెట్టారు. బి.జె.పి చెప్పుకోవడానికి కూడా దేశంలో అభివృద్ధి ఆ పార్టీ ఏమిచేయలేదు. ఈ హిందూత్వ రాజకీయ ప్రమాదాన్ని ప్రజలంతా గుర్తించాలి. దేశంలో ప్రజలకు రాబోయే రోజులు మరింత గడ్డుగా వుంటాయి. అయితే ప్రజలు ధైర్యంగా బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి. బ్రాహ్మణీయ హిందూత్వ సిద్ధాంతాన్ని బహిర్గతపర్చాలి. ప్రజలు ఎక్కడికక్కడ తమ సమస్యలపై మిలిటెంట్ ఆందోళనలు చేపట్టాలి. ఈ ఆందోళనల్లో కలిసి వచ్చే వ్యక్తులు, శక్తులు, సంస్థలు, పార్టీలన్ని ఐక్యం కావాలి. విప్లవ పార్టీని మరింత సంఘటితం చేసుకోవాలి. దాన్ని కాపాడుకోవాలి. పిఎల్‌జిఏను పటిష్టం చేసుకుంటూ విప్లవోద్యమానికి అండగా నిలబెట్టాలి. దేశానికి అత్యంత ప్రమాదకరంగా మారిన బ్రాహ్మణీయ హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడడం, దాన్ని సమాధి చేయడం ద్వారానే ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం విముక్తి లభిస్తుంది.